
# శాపం

— రమణ కృష్ణ



## హైదరాబాద్ రైల్వే ప్లాట్ ఫారం హడా వుడిగా లేదు.

జనం కిక్కిరిసి పోయిలేరు.

కొచ్చిన్ సూపర్ ఫాస్ట్ కదలడానికి సిద్ధంగా వుంది.

వేసవి సెలవులు కానిసమయాల్లో సికింద్రాబాద్‌లోకాని రైలు నిండక పోవడం సహజమే.

వేసేపని మరేమీ లేక పోవడంతో ఒక సారి గతంలో ఇటీవల జరిగిన విషయాల్ని మననం చేసుకోసాగాను.

మన దేశంలో ఏ స్థలంలో నైనా చాలా సహజంగా, సులభంగా కనిపించే లక్షలాది నిరుద్యోగులలో నేనూ ఒకణ్ణి కావడం పెద్ద విషయమేమీ కాదు. అందులోనూ నా చేతికి డిగ్రీ వచ్చి కేవలం మూడు సంవత్సరాలే అయింది. చాలా మంది కన్నా నేను జూనియర్‌నే...

అయితే నిజంగా మన దేశంలో నిరుద్యోగ సమస్య అనుకున్నంత ఘోరంగా వుందా?... ఫాల్స్ ప్రిస్టేజి, డిగ్నిటీ ఆఫ్ లేబర్ లాంటివి ఈ సమస్యకి ఎంత వరకు తోడ్పడు తున్నాయి లాంటి అంశాలు ఆలోచించే సందర్భం కాదిది.... సో... నేనూ నిరుద్యోగిని... అంతే. అదొక్కటే ప్రస్తుతం. ప్రస్తుతం నేను నిరుద్యోగిని కావడానికి కారణం కూడా నేనే...

అనేక చోట్ల ప్రయత్నించి దొరికిన ఉద్యోగాల్ని అనేక కారణాల వల్ల వదులు కొని కదలని గొంగళిలా మిగిలి పోతున్నాను నేను. రెండు రోజుల క్రితం అందుకున్నాను పిళ్ళై నుండి ఉత్తరం, తన ఆర్గనైజేషన్‌లో ఛాలెంజింగ్‌గా, అడ్వెంచరస్‌గా ఓ స్థానం వుందనీ, ఇంటరెస్ట్ వుంటే రమ్మనీ రాశాడు.

పిళ్ళైకీ నాకూ మధ్య ఎలాంటి రహస్యాలూ లేవు. చాలా దగ్గర స్నేహితుడు వాడు నాకు. కాని- తను చేస్తున్న ఉద్యోగం గురించి ఎప్పుడూ వాడు నాకు రాయలేదు.

అడ్వెంచర్‌లు నాకు చాలా ఇష్టం కావడంతో వాడిచ్చిన అడ్రెసూ, లెటరూ చేత బట్టుకొని ఉన్నబట్టలు సూట్ కేసులో సర్దుకొని బయలు దేరాను నేను.

'హైదరాబాదు నుండి కొచ్చిన్ పోవు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కొద్ది నిమిషములలో బయలు దేరును...'' మూడు భాషల్లోనూ ఏ భాషా సరిగ్గా పలకకుండా అనౌన్స్‌మెంట్ జరుగుతూంది.

''ఎక్స్‌క్యూజ్ మీ...''

తల తిప్పి చూశాను.

పాతికేళ్ళుంటాయతనికి

''ఎస్‌ప్లీస్!''

''ఎక్కడి దాకా మీరు?''

''కొచ్చిన్''

''ఓ... నా ఎయిర్ బాగ్ కాస్త చూస్తుంటారా?... ఇప్పుడే వస్తాను.'' నిజానికి నేనూ సిగరెట్లు తెచ్చుకోవాలి. ఆ విషయం తరవాత స్టేషన్‌లో చూసుకోవచ్చులే అని వూరుకున్నాను.

''ష్యూర్...''

అతను వెళ్ళాడు

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

రైలు కదిలింది... హడావుడిగా వచ్చి ఎక్కాడతను.

'థ్యాంక్యూ... నా పేరుశివరామకృష్ణ...' చేయి సాచాడతను.

"నాపేరు శర్మ... సుబ్రహ్మణ్యశర్మ" కరచాలనం చేశాను. సిగరెట్ ఆఫర్ చేశాడతను.

"థాంక్స్" అందుకొని అంటించుకున్నాను. అది నా బ్రాండ్ కాదు... అయినా ఒక్కటేగా... సికింద్రాబాదులో ఎలాగూ నా బ్రాండ్ కొంటాను.

"నేను కోయంబత్తూర్ వరకూ... మీరు పర్సనల్ ట్రిప్పా!?"

"అవును మీది?"

"ప్యాక్టరీ అఫీషియల్... ఎక్కడుంటారు హైదరాబాదులో?"

"మారేడ్‌పల్లి... మీరో?"

"నాదీవూరు కాదులెండి... ఇంత ఖాళీ వుందేమిటి కంపార్ట్‌మెంటు?"

"సికిందరాబాదులో ఎక్కుతారేమో"

టి.టి.ఇ. వచ్చాడు. ఇద్దరి టిక్కెట్లూ చెక్ చేసి ముందుక్కదిలాడు. రైలు నెమ్మదిగా హుసేన్‌సాగర్ దాటి సికందరాబాదు చేరింది.

"కాస్త నా సూట్ కేసు చూస్తూ వుండండీ? నేనూ సిగరెట్లు తెచ్చుకుంటా"

"ఇవి ఉన్నాయిగా?"

"థాంక్స్... కాని అవి నా బ్రాండ్ కాదు"

"ష్యూర్... వెళ్ళిరండి".

జనం తోసుకుంటూ ఎక్కేస్తున్నారు. ఎలాగోలా బయటపడి సిగరెట్టు కొట్టుకేసి పరిగెత్తాను.

సిగరెట్లు రెండు పేకెట్లుకొని, కుళాయిలో మంచినీళ్ళు తాగి కంపార్ట్‌మెంట్ కేసి నడిచాను.

గార్డు విజిల్ వినిపించింది. దూరంగా సిగ్నల్ మారింది. రైలు కూత వేసింది.

కదిలింది... వడి వడిగా నడిచి కంపార్ట్‌మెంట్ ఎక్కేశాను.


కంపార్ట్‌మెంట్ దాదాపు నిండి పోయి వుంది. చాలా మంది వున్నారు...

ఒక్క శివ రామకృష్ణ తప్ప...

నాకు పిచ్చెక్కించిన విషయం అదికాదు...

నాసూట్ కేసూ లేదు...

సూట్ కేసు పోయినందుకు పెద్దగా బాధ




పడనక్కర లేదు. కాని చాలా కాలంగా దాచుకున్న డబ్బు ఓ వెయ్యి రూపాయిలూ, కొన్ని పాత తీపి జ్ఞాపకాల వుత్తరాలూ ఎంతో విలువైన కొన్ని కాగితాలూ, నా డిగ్రీ సర్టిఫికెట్లూ, అన్నీ... అన్నీ అందులోనే వున్నాయి.

"ఇందాక మీ రెక్కవప్పుడిక్కడో వ్యక్తిని చూశారాండీ? నీలం రంగు ఎయిర్ బేగూ..." ఆతృతగా అడిగానో వృద్ధుణ్ణి...

'అవునవును, ఓ సూట్ కేస్ కూడా పొరపాట్న ఈ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కానని చెప్పి మారి పోయాడే. ఏం బాబూ? అలా అయిపోయావే? ఏం జరిగింది! అతను మీ తాలూకావా?"

"కాదండీ... ఆ సూట్ కేసు నాది. చూస్తూండమని చెప్పి నేను సిగరెట్లు తెచ్చుకు నేంతలో..."

—"అయినా ముక్కూ మొహం తెలియని వాళ్లెలా నమ్మావయ్యా?"

"ఇందాక తనేదో తెచ్చుకోవడానికి వెళుతూ, ఎయిర్ బాగ్ నా దగ్గర వదిలి వెళ్ళాడండీ... దాంతో ఇలా చేస్తాడను కోలేదు"

"ఓరి వీడి అసాధ్యం కూలా..." అరె ...పాపం" "ఏవయ్యిందండీ..." "దొంగ రాస్కెల్స్"... "పురుగులు పడి పోతారండీ"..." పోలీస్ కంప్లెయింటివ్వండీ" "దాని వల్లేమీ లాభముండ దండీ"" ఎందరి ఉసుర్లు పోసుకుంటున్నారో?"

ఆ వ్యక్తికి అందని శాపనార్థం లేదింక....

రైల్వే పోలీసుకి కంప్లెయింటిచ్చి పోలో మంటూ జేబులో మిగిలిన టిక్కెట్టూ, పది రూపాయిలతో పిళ్ళైని చేసే సరికి తల ప్రాణం తోకకొచ్చింది.

"మొట్ట మొదట ఒంటరి వ్యక్తిని పట్టు కోవాలి. అతనికి మనపైన నమ్మకం కలిగేలా చెయ్యాలి. ఆ తరవాత సమయం చూసి మనకి కావలసింది అందుకొని చెక్కెయ్యాలి..."పిళ్ళై చెప్పుకు పోసాగాడు.

"ఇది చట్ట విరుద్ధం. పైగా ఎందరో అన్యాయంగా తమకెంతో కావలసిన, మీకుపయోగపడని వస్తువులు కోల్పోతారు".

"ఈ ప్రపంచంలో న్యాయం, అన్యాయం, అనే పదాలు సబ్జెక్టివ్ శర్మా. ఇవి మనిషి మనిషికీ మారతాయి. ఆ లెక్కనే ఎందరో వ్యక్తులకి జీవనోపాధి కల్పిస్తున్న మా సంస్థ చేస్తున్నది. 'అన్యాయం అంటే నేనంగీకరించను" "సరే పోనీ... అంతా కష్టపడి కొట్టేసిన పెట్టెలో విలువైన వస్తువులు దొరుకుతాయన్న గేరంటీ ఏమిటి? ఆ లెక్కన నష్టమే కదా?"

"మంచి ప్రశ్న... ఇది ఏక వ్యక్తి కార్యమైతే నష్టమే శర్మా... కాని ఇదో పెద్ద ఆర్గనైజేషన్ యూనిట్‌ల క్రింద విభజించబడి వుంది. నాదో యూనిట్... నాకు ఆరుగురు అసిస్టెంట్లు... అలా... ఒక యూనిట్ కొచ్చిన నష్టాన్ని మరో యూనిట్ లాభాలతో పూరిస్తాం. అన్ని యూనిట్లకీ నష్టం వస్తే?... అలా జరగదనుకో... కాని జరిగితే? అది అందరిదీని అలాగే లాభాలు కూడా అందరివీని.

నిన్నింకా తీసుకొస్తున్నట్టు నేను ఎవరికీ చెప్పలేదు. ఈ రోజు రిలాక్స్ అయిపో...రేపు పొద్దున్నే ఇంట్రడ్యూస్ చేస్తాను బాస్‌కి. ఒ.కె.? నా యూనిట్‌లోనే చేరిపోదువుగాని. రెండు నెలలు ట్రెయినింగ్ ఇస్తాను. తరవాత ఫీల్డ్‌కి వెళుదువు గాని..."

"ఎవరైనా మెంబర్ ఆర్గనైజేషన్ వివరాలు తెలుసుకున్నాక వెళ్ళిపోదలిస్తే?" చిన్నగా నవ్వాడు పిళ్ళై...

"పంపించేస్తాం...అంతే..."

అతనలా పంపించేస్తాం అనడంలో నాకెన్నో అర్థాలు గోచరించాయి.

"సరే...వెళ్ళి పడుకో."

లోపలి గదిలోకి వెళ్ళాను. మంచం వుందక్కడ. దాని మీద పడుం వాల్చగానే నిద్రపట్టేసింది.

కలత నిద్ర...అనుక్షణం మస్తిష్కంలో శివ రామకృష్ణే తిరుగుతున్నాడు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

బయట గదిలో ఏదో మాటలు వినిపించే సరికి మెలకువ వచ్చేసింది నాకు.

మాటలు బయటి గదిలోంచి కాదు వినిపిస్తున్నది...

పెరటి వైపు నుండి...

"బాస్...ఇది 'పీ' త్రీ తెచ్చిన సూట్ కేస్... 'బీ' టూ తెచ్చిందిది...కాని..." ఎవరిదో గొంతది.

"కాని?" అది పిళ్ళై గొంతే...

" 'బీ'టు. నిన్న కొచ్చిన్ సూపర్ ఫాస్ట్‌లో కొట్టేశాడీ సూట్ కేస్...ఇది నాకిచ్చి తిరిగి వెళుతుండగా ఏక్సిడెంటయింది. హాస్పిటల్లో వున్నాడు."

"ఎలా వుందిప్పుడు?"

"బతికే హోప్స్ లేవు...చాలా సీరియస్‌గా వుంది."

"మై గాడ్..."

తరువాత మాటలాగిపోయాయి. నాచి చూశాను. ఒంటిగంటయ్యింది మధ్యాహ్నం. తిరిగి నిద్రలోకి జారుకున్నాను.

మళ్ళీ లేచేసరికి మూడయ్యింది.

బయట గదిలో కొచ్చాను.

పిళ్ళై ఎక్కడికో బయలుదేరుతున్నాడు.

నాలో కోటి ఆలోచనలు...నేనేం చెయ్యాలి...ఏం చెయ్యాలి...

"ఎక్కడికి?" అడిగాను.

"శివరామకృష్ణ అని మా యూనిట్ మెంబర్...చనిపోయాడు హాస్పిటల్లో... ఫ్యునరల్ వుంది సాయంత్రం..."

నా గుండె లయ తప్పింది.


"ఇందాక నష్టాల గురించి మాట్లాడుకున్నామే...ఇదే వుదాహరణ. అతని హాస్పిటల్ ఖర్చులు యూనిట్ భరిస్తుంది. కాని అతను తెచ్చింది మాత్రం నిన్న నష్టమే...అదే సూట్ కేసు..." చూపించాడు. ఒళ్ళు జలదరించింది.

ఎంత మంది ఉసురులు పోసుకున్నాడో... పురుగులుపడి పోతాడండీ...దొంగ రాస్కెల్స్... ఎంత ఇబ్బంది పెడుతున్నావ్‌రా దొంగలం... కంపార్ట్‌మెంట్‌లోని వారి మాటలు, నా మనో భావాలూ గిరున తిరిగి దొలుస్తున్నాయి మస్తిష్కాన్ని...

"ఏం...?" అదోలా వున్నావ్?"

"ఆ...ఏం లేదు...నీరసంగా వుంది..."

"ఓ...రెస్ట్ తీసుకో. ప్రయాణం కదా నిన్నంతా! రాత్రికి కలుస్తా" బయటికి కదలబోయాడు.




"పిళ్ళై..."

"ఊ..." ఆగాడు.

"డబ్బు కావాలి కాస్త...అప్పులు లేవు నా దగ్గర"

"ఓ ఎంత?"

"ఓ టూ హండ్రెడివ్వు."

ఇచ్చాడు. "బై" వెళ్ళిపోయాడు.

నా సూట్ కేసు నిమురుతూ వుండిపోయాను చాలా సేపు.

తరువాత కాగితం, పెన్నూ అందుకుని రాయనారంభించాను.

పిళ్ళై...

చెప్పా పెట్టకుండా వెళ్ళిపోతున్నందుకు క్షమించు. నీ వివరాలుగాని, నువ్వు చెప్పిన విషయాలుగాని ఎక్కడా బయటికి రావు. భయపడొద్దు. మీ సంస్థ మంచిదా కాదా అనేది కాదు ప్రశ్న. నేనందులో ఇమడగలనా లేదా అన్నదే సమస్య. నిరుద్యోగ సమస్యకి ఇదో పరిష్కార మార్గం అంటే నా మనసొప్పట్లేదు. మనిషిని మోసి సంపాదించవచ్చుగాని మనిషిని మోసగించి సంపాదిస్తే సుఖం దక్కదు. ఎందరో అభాగ్యుల శాపనార్థాలకీ, ఉసురులకీ గురై ప్రాణాలు కోల్పోయే అడ్వెంచర్ కాదు ఫ్రెండ్ నేను కోరేది. ఒక్కసారి ఆలోచించు పిళ్ళై...మనిషి మనుగడకి దోపిడి తప్ప మార్గం లేనంత హీనస్థితికి చేరుకొన్నామా మనం? కాదనే నా అభిప్రాయం. ఓ స్నేహితుడిగా ఆ వ్యాపకం మానేయమని నా సలహా. నిరుద్యోగం మనం అనుకున్నంత ఘోర స్థితిలో విజృంభించి లేదు.

ఉంటాను...

నీ రెండొందలూ వీలున్నంత తొందరలో పంపేస్తాను.

అయితే నిన్న మీ శివరామకృష్ణ నా నుండి కాజేసుకొచ్చిన సూట్ కేసూ, అందులోని వెయ్యి రూపాయిలు మాత్రం ఇక్కడే వదిలేస్తున్నాను. నా డిగ్రీ సర్టిఫికెట్లూ, మీకుపయోగ పడని కొన్ని కాగితాలూ, నా బట్టలూ తీసుకెళుతున్నాను-నాకున్నవే అవి కాబట్టి. ఇక సూట్ కేసూ, డబ్బూ అంటావా...అది మీ సంస్థ ప్రాపర్టీ ఇప్పుడు. శివరామకృష్ణ కుటుంబానికి అందజేస్తే సంతోషిస్తాను...నాకో అవకాశం-మంచిదికానీ మరోటిగానీ, ఇవ్వడానికి ప్రయత్నించావ్. యూ ఆర్ ఇన్‌డీడ్ ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్...

థాంక్స్...

శర్మ.

రైలులో కూర్చున్నానన్న మాటేగాని నా అంతరాత్మ నన్ను నిలదీస్తోంది, 'నువ్వు వెళ్ళిపోవడానికి కారణం ఏమిటి?' అంటూ.

నిజమే.

కారణం ఏమిటి?

పిళ్ళై చెప్పిన పద్ధతి పట్ల అపనమ్మకమా?...

మానవత్వం ఇంకా నాలో మిగిలి వుండటమా?...

బోర్డువారి చేతుల్లో ఏదో రోజు చావచ్చనే భయమా?...

నాలాంటి వారి శాపనార్థాలే శివరామకృష్ణ ప్రాణాల్ని బలిగొన్నాయనే భావనా?...

అయితే-నా సూట్ కేస్ దొంగతనం కాకుండా వుండి వుంటే నేనా సంస్థలో చేరేవాడినా?...

'కానన్నా' అని ఘోషిస్తున్న అంతరాత్మని విసుగ్గా పక్కకి నెట్టి వెనక్కి జారగిల బడ్డాను.

కేరళ నుండి హైదరాబాద్ టూరు వెళుతున్న అందమైన అమ్మాయిల గుంపొకటి పక్క కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని పాడుకొంటోంది.

"తాళమేళ అయింగలోడ-హొలెలూయా

[redacted]

హొలెలూయా-హొలెలూయా-హొలెలూయా

పాడాం..."

తాళ బద్ధంగా సాగిపోతున్న ఆ మధుర మలయాళ గీతంలో లీనమై అలా నిద్రలోకి జారుకోవడానికి ప్రయత్నించ సాగాను.

రైలు తిరిగి నన్ను గొంగళిగా మార్చే ప్రయత్నంలో వేగంగా దూసుకు పోతోంది. ●